ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 33.0
కనిష్ఠం 22.6
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
శనివారం 27 జూలై 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	505.60 (124.3222)	45,236	6,500
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.20 (3.74)	790.50	211.54
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	102.88 (1.03)	301	నిల్

చికెన్ ధరలు | లైవ్: రూ.142 | డ్రెస్: రూ.220 | స్కిన్‌లెస్: రూ.250

- నిలిచిన వనమహోత్సవం
- జిల్లాలో వర్షాభావ పరిస్థితి
- 55.65 శాతం మేరకు నాటిన పలు శాఖలు
- లక్ష్యం 17.45 లక్షలు... నాటింది కేవలం 7.42లక్షలు
- జిల్లాలో సగటున 218.7 మి.మీ.ల వర్షపాతం
- ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో వెనుకడుగు



ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం 'వనమహోత్సవం'లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం ముందుకు సాగడంలేదు. జిల్లాలో తీవ్రంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. గత సంవత్సరం భారీ వర్షాలు కురవగా, ఈసారి వరణుడు ముఖం చాటేశాడు. రాత్రివేళల్లో ఆకాశమంతా మేఘావృతమై, భారీ వర్షం కురిసేలా కన్పిస్తూ.. చిరుజల్లులకు పరిమితమవుతోంది. భారీగా వర్షాలు కురవగానే వనమహోత్సవంలో జిల్లావ్యాప్తంగా విరివిగా మొక్కలు నాటేందుకు జిల్లాయంత్రాంగం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంది. అయితే వర్షాలు లేకపోవడంతో మొక్కలు నాటాలా? వద్దా? అన్న సందిగ్ధంలో పడింది.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

లక్ష్యం నెరవేరేనా?



ఈ సంవత్సరం వానాకాలంలో జిల్లాలో ఇప్పటివరకు జిల్లాలో సగటున 218.7మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 217.1మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గత నాలుగైదు రోజులుగా చిరుజల్లులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. జిల్లాలోని చౌటుప్పల్, గుండాల మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువగా వర్షపాతం నమోదుకాగా, మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. దీంతో మొక్కలు నాటేందుకు పలు శాఖలు సాహసం చేయడంలేదు. వర్షాలు పుష్కలంగా కురిస్తేనే నాటాలని నిర్ణయించుకున్నారు. వర్షాభావ పరిస్థితుల్లో మొక్కలు నాటిన పక్షంలో... వాటిని సంరక్షించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో భారీ వర్షాల కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు.

నర్సరీల్లోనే మొక్కలు

వనమహోత్సవం కింద నాటాల్సిన మొక్కలను నర్సరీల్లోనే అందుబాటులో ఉంచారు. భారీ వర్షాలు కురవగానే సంబంధిత శాఖలకు నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను పంపిణీ చేయనున్నారు. ఈ పథకం కింద ప్రధానంగా నీడనిచ్చే చెట్లతోపాటు పండ్లు, పూల చెట్లను పెంచేందుకు జిల్లాయంత్రాంగం తగిన కార్యాచరణ ప్రణాళిను రూపొందించింది. టేకు, కానుగ, నేరేడు, ఈత, ఉసిరి, దానిమ్మ, నిమ్మ, జామ, బొప్పాయి, సీతాఫల్ పండ్ల మొక్కలను, చెరువు కట్టలపై ఈత, కర్జూర, తుమ్మచెట్లను నాటేందుకు చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా ఇళ్లల్లో పెంచుకునేందుకు పలు రకాల పూల మొక్కలను కూడా పంపిణీ చేయనున్నారు. వీటిలో గులాబీ, గన్నేరు, చామంతి, మల్లెపూలు, తదితర మొక్కలను పంపిణీ చేయనున్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రదేశాలతోపాటు ప్రభుత్వ భూములు, కార్యాలయాలు, ప్రభుత్వ రంగసంస్థల్లో, ప్రైవేట్ సంస్థల్లో, రోడ్డుకు ఇరువైపులా, ప్రతీ ఇంటి వద్ద మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించారు.

హరితహారంలో ఇప్పటివరకు నాటిన మొక్కలు 7.42లక్షలు

జిల్లాలో 2024లో 17.45లక్షల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. జిల్లాలో ఇప్పటివరకు 7.42లక్షల మొక్కలను మాత్రమే నాటారు. డీఆర్డీవో 5.89లక్షల మొక్కలు, ఉద్యానవన శాఖ 27వేలు, ఆబ్కారీ శాఖ 3వేలు, వ్యవసాయ శాఖ 7వేలు, అటవీశాఖ 81వేలు, మునిసిపాలిటీల్లో 44వేలు, పంచాయతీరాజ్ ఈఈ శాఖ 8వేలు, రోడ్లు, భవనాల శాఖ 3వేలు, పరిశ్రమల శాఖ 11మొక్కలను నాటింది.

ఈ ఏడాది లక్ష్యం 17.45లక్షలు

జిల్లాలో మొత్తం 421 గ్రామపంచాయతీలు, ఆరు మునిసిపాలిటీలున్నాయి. ఈ సంవత్సరం 17.45 లక్షల మొక్కలను నాటేందుకు ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. జిల్లాలో మొత్తం 451 నర్సరీలను ఏర్పాటుచేశారు. వీటిలో గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించినవి 418 నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ 9 లక్షల మొక్కలు, అటవీశాఖ లక్ష, వ్యవసాయ శాఖ 25 వేలు, ఉద్యానవన శాఖ 50 వేలు, పంచాయతీ శాఖ 2 లక్షలు, సాగునీటి శాఖ 25 వేలు, రోడ్లు, భవనాల శాఖ 25వేలు, పంచాయతీరాజ్ శాఖ 45 వేలు, ఆబ్కారీ శాఖ 40 వేలు, పరిశ్రమల శాఖ 25 వేలు, భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, చౌటుప్పల్, మోత్కురు, పోచంపల్లి మునిసిపాలిటీల్లో 3.17 లక్షల మొక్కలను నాటేందుకు జిల్లా యంత్రాంగం లక్ష్యాన్ని నిర్దేశించింది.

వర్షాభావ పరిస్థితులతోనే ఆలస్యం

జిల్లాలో వానాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో వనమహోత్సవం కింద మొక్కలు నాటడం ఆలస్యమైంది. భారీ వర్షాలు కురవగానే మొక్కలు నాటేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ప్రస్తుతం మొక్కలను గ్రామాల్లో నర్సరీల్లో అందుబాటులో ఉన్నాయి. 2024 సంవత్సరంలో ప్రభుత్వం నిర్దేశించిన 17.45 లక్షల మేరకు నాటాల్సిన మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకున్నాం. జిల్లాలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మొత్తం 418 నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నాం. వీటితోపాటు అటవీ శాఖ 18, మునిసిపల్ శాఖ 15 నర్సరీలు ఏర్పాటుచేసింది. వర్షాలు కురవగానే మొక్కలను పంపిణీ చేయనున్నాం. ఇప్పటికే అన్ని శాఖలు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాయి.

- పద్మజారాణి, డీఎఫ్‌వో, భువనగిరి

'గాలి' లెక్కలుండవ్

- నాణ్యతా ప్రమాణాలు ఇక పక్కా
- ఉమ్మడి జిల్లాకు తొమ్మిది పర్యవేక్షణా కేంద్రాల మంజూరు



భువనగిరి టౌన్, జూలై 26: ఉమ్మడి జిల్లాలో తొమ్మిది గాలి నాణ్యతా పర్యవేక్షణ స్టేషన్ల ఏర్పాటుకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) అనుమతిచ్చింది. ఏర్పాటు వ్యయంలో 50శాతం సీపీసీబీ, మిగతా 50శాతం తెలంగాణ కాలుష్య నియంత్రణా మండలి భరించనున్నాయి. ఈపాటికే ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో గాలి నాణ్యతా పర్యవేక్షణా స్టేషన్ల ఏర్పాట్ల పనులు ప్రారంభమయ్యాయి. అయితే గతంలోనే మూడు పర్యవేక్షణా కేంద్రాలుండగా నూతనంగా ఏర్పాటుచేసే కేంద్రాలతో కలిపి ఉమ్మడి జిల్లాలో గాలి నాణ్యతా పర్యవేక్షణా స్టేషన్లు 12కు చేరనున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో కలుషిత గాలి నియంత్రణకు చర్యలు తీసుకునేందుకు అవకాశాలు సుగమంకానున్నాయి. కాగా వాయునాణ్యత సూచి (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్- ఏక్యూఐ) 0-50 వరకు ఉంటే స్వచ్ఛమైన, ఎలాంటి ఇబ్బందులు లేని గాలిగా పరిగణిస్తారు. కానీ సిమెంట్, రసాయన పరిశ్రమలు, ఇండస్ట్రియల్ పార్కులు, రైస్ మిల్లులు తదితర కాలుష్య కారక కారణాలతో ఉమ్మడి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఏక్యూఐ సగటు 90 నుంచి 130,కొన్ని సందర్భాల్లో 180వరకు ఉంటుండటం ఆందోళన కలిగిస్తున్న అంశం.

లెక్కింపు ఇలా..

గాలి నాణ్యతా పర్యవేక్షణ స్టేషన్ల ద్వారా ఆయా ప్రాంతాల్లో వీస్తున్న గాలి నాణ్యతను లెక్కిస్తారు. ఎప్పటికప్పుడు ఆయా స్టేషన్లలో గాలి నాణ్యత నమోదవుతూ పీసీబీ సెంటర్ సర్వర్‌కు చేరుతుంది. వాతావరణంలోని ఉద్గారాలను నాణ్యతా కేంద్రం లెక్కిస్తుంది. ఎస్‌వో-2, సూక్ష్మ ధూళి కణాలు ఉండే పీఎం 10, అతి సూక్ష్మ ధూళి కణాలుండే పీఎం 2.5 లెక్కించనున్నారు. ప్రతీ నాలుగు గంటలకు ఎస్‌వో-2, ప్రతీ ఎనిమిది గంటలకు, పీఎం 10, 2.5 ఉద్గారాల నమూనాలను పీసీబీ సేకరిస్తుంది. అలాగే ఎక్కడ ఏ రకమైన ఉద్గారాలు పరిమితికి మించి ఉన్నాయి, ఏ సమయంలో ఎక్కువ కాలుష్యం వెలువడుతున్నది తదితర వివరాలు నమోదు కానున్నాయి. నాణ్యతా స్టేషన్లలో నమోదయ్యే వివరాల ఆధారంగా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు వాయు కాలుష్య నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకునే వీలుంటుంది. అయితే మనం పీల్చేగాలిలో మితిమీరి ఉంటున్న ఉద్గారాలు నేరుగా ఊపిరితిత్తుల్లోకి చేరుతాయి. ఫలితంగా ఊపిరితిత్తులు, గుండె జబ్బులు, చర్మ, నేత్ర సమస్యలు తదితర వ్యాధులకు కారణమవుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో పాతవి మూడు.. కొత్తగా తొమ్మిది

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నల్లగొండలో రెండు, చౌటుప్పల్‌లో ఒకటి మొత్తంగా మూడు గాలి నాణ్యతా పరీక్షా కేంద్రాలు ఈపాటికే ఉన్నాయి. తాజాగా మరో తొమ్మిది మంజూరయ్యాయి. వీటిలో యాదాద్రి భువనగిరి జిల్లా లో భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్‌పై ఏర్పాటు చేయనుండగా యాదగిరిగుట్టపై ఏర్పాటు చేసేందుకు ఎన్‌వోసీ కోసం పీసీబీ అధికారులు ఆలయ ఈవో కు లేఖ రాశారు. నల్లగొండ జిల్లాలో కలెక్టరేట్‌పైన, మిర్యాలగూడ ఫైర్‌స్టేషన్, పోలీస్‌స్టేసన్, అగ్రికల్చర్ సొసైటీ కార్యాలయాలపై ఏర్పాటు చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో కలెక్టరేట్, టౌన్ పోలీస్‌స్టేషన్‌పైన, చివ్వెంల పోలీస్‌స్టేషన్‌పై ఒకటి చొప్పున ఏర్పాటు చేయనున్నారు.

మృతుడి పేరిట మీటర్ కనెక్షన్‌కు దరఖాస్తు

- మీటర్ బిగింపులో ఆలస్యమవుతోందని జేఎల్‌ఎంపై దాడి
- రాజీకోసం యూనియన్, ఉద్యోగ సంఘాల యత్నాలు

భువనగిరి టౌన్, జూలై 26: మృతి చెందిన వ్యక్తి పేరిట నూతన విద్యుత్ మీటర్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న ఓ కుటుంబం మీటర్ బిగింపులో ఆలస్యమవుతోందని జేఎల్‌ఎంపై దాడి చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో ఈ సంఘటన జరిగింది. భువనగిరి పట్టణంలోని జలీల్‌పురకు చెందిన పాత ఇనుప సామాన్ల దుకాణం నిర్వాహకుడు అబ్దుల్ గఫూర్ కొంతకాలం క్రితం మృతి చెందాడు. అయితే కుటుంబ సభ్యులు అతని పేరిట ఈ నెల 18న భువనగిరిలోని కన్స్యూమర్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)లో విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేయగా, వారు టౌన్ ఏఈకి పంపారు. ఈ క్రమంలో విద్యుత్ మీటర్ కనెక్షన్‌కోసం దరఖాస్తుదారులు సీఎస్‌సీ సెంటర్‌కు వస్తూ ఆ ప్రాంత జేఎల్‌ఎం నీలం మహేష్‌ను ఫోన్‌లో సంప్రదిస్తున్నారు. ఇటీవల కురిసిన వరుస వర్షాలకు తోడు, దరఖాస్తుదారుడు నేరుగా వచ్చి సంతకం పెట్టాలంటూ ఏఈ సాయికృష్ణ సూచించిన నేపథ్యంలో విద్యుత్ కనెక్షన్ మంజూరులో జాప్యం జరిగింది. అయినప్పటికీ దరఖాస్తుదారులు జేఎల్‌ఎంను ఫోన్లలో దూషిస్తూ గురువారం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో మీటర్ రీడింగ్ తీసుకుంటున్న అతనిపై భౌతిక దాడికి దిగారు. దీంతో వెంటనే జేఎల్‌ఎం మహేష్ అదేరోజు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన క్రమంలోనే దరఖాస్తుదారుడు గతంలోనే మృతి చెందినట్లు వెలుగుచూసింది. ఈ మేరకు జరిగిన ఉదంతంపై శుక్రవారం ట్రాన్స్‌కో డీఈ కార్యాలయం ఆవరణలో అధికారులు ఉద్యోగులతో సమావేశంకాగా, స్థానిక రాజకీయ నాయకులు సైతం పాల్గొన్నారు.

రాజీ కుదుర్చుకుందామంటూ ప్రతిపాదన

యూనియన్లు, ఉద్యోగులు రెండు వర్గాలుగా చీలి జేఎల్‌ఎంపై దాడి చేసిన వారితో రాజీ కుదుర్చుకుందామంటూ ఓ వర్గం ప్రతిపాదించి ఒత్తిడి తెచ్చింది. మరో వర్గం ఈ ప్రతిపాదనను వ్యతిరేకించినప్పటికీ ఫలించలేదు. బాధిత జేఎల్‌ఎంతోపాటు ట్రాన్స్‌కో అధికారులు, యూనియన్ నాయకులు స్వయంగా రెండు రోజుల క్రితం పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదును వెనక్కి తీసుకున్నట్లు సీఐ సురేష్‌కుమార్ తెలిపారు. అయితే తప్పుడు దరఖాస్తు చేసుకొని ఉద్దేశ్యపూర్వకంగా విధుల్లో ఉన్న ఉద్యోగిపై దాడి చేసిన వారిపై చర్యలకు డిమాండ్ చేయాల్సిన అధికారులు, యూనియన్ నాయకులు అందుకు భిన్న వైఖరి పాటించడంపై క్షేత్రస్థాయి ఉద్యోగులు మండిపడుతున్నారు. భవిష్యత్‌లో కూడా దాడులు జరిగితే మాకు ఎవరు రక్షణ కల్పిస్తారని ప్రశ్నిస్తున్నారు. సీఎస్‌సీ సెంటర్ నిర్వహణ, సీఎస్‌సీ సెంటర్‌లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరపాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఇష్టానుసారంగా సీఎస్‌సీ సెంటర్ నుంచి విద్యుత్ సర్వీస్‌లను అక్రమమార్గంలో మంజూరు చేస్తున్నారని, ఈ అక్రమ పర్వంలో ఓ ముఖ్య ఉద్యోగి కీలక పాత్ర పోషిస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారు. అక్రమ దరఖాస్తు, ఉద్యోగిపై దాడి కేసు రాజీలో కూడా ఆ ముఖ్య ఉద్యోగే కీలక పాత్ర పోషించాడని విమర్శలు వస్తున్నాయి. తమ ఉద్యోగిపై బహిరంగంగా జరిగిన దాడిపై కఠినంగా ఉండాల్సిన అధికారులు కూడా దాటవేత వైఖరి పాటిస్తున్న తీరుపై ఉద్యోగులతోపాటు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ హనుమంతు కే.జెండగే



కప్రాయిపల్లిలో కల్లాపి తొట్టిని పరిశీలిస్తున్న కలెక్టర్ జెండగే

ఆత్మకూరు(ఎం), జూలై 26: ప్రస్తుత వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించి, అప్రమత్తం చేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఆదేశించారు. శుక్రవారం మండలంలోని కప్రాయిపల్లిలో పరిసరాల పరిశుభ్రతను, మండల కేంద్రంలోని పీహెచ్‌సీని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించారు. కప్రాయిపల్లిలో గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణ నీటి రింగుల్లో నిల్వ ఉన్న నీటిని చూసి ఎందుకు నీటిని తొలగించలేదని కార్యదర్శిని కలెక్టర్ ప్రశ్నించారు. గ్రామంలో ఓ ఇంటి వద్ద కల్లాపి తొట్టిలో ఉన్న పేడ నీళ్లను చూసిన కలెక్టర్ తొట్టి ఖాళీ చేయించారు. వర్షాకాలంలో నీటి నిల్వ వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు అవగాహన కల్పించారా? అని ఏఎన్‌ఎం అశ్వినిని ప్రశ్నించారు. ప్రతీ శుక్రవారం డ్రైడే గా పాటించాలని, నీటి నిల్వలు లేకుండా చేయాలని, వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పాలు, గుడ్లు, బాలామృతం అందుతున్నాయా? అని బచ్చ అనూష అనే మహిళను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మండల కేంద్రంలో ని పీహెచ్‌సీని తనిఖీచేసి రికార్డులను క్షుణంగా పరిశీలించారు. రికార్డులో పేరు నమోదైన గర్భిణులు సకాలంలో చెకప్ చేయించుకునేలా ఏఎన్‌ఎంలు, ఆశాలు సహకరించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులు ఎక్కువ జరిగే విధంగా చూడాలని కలెక్టర్ సూచించారు. ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పించాలని, సరైన మందులు లేవని, వైద్య సిబ్బంది సమయపాలన పాటించడంలేదని, రోగులు వస్తే సిబ్బంది పట్టించుకోవడంలేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరుతూ కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు పోతగాని మల్లేశం, తవిటి వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఫార్మాసిస్టును పిలిచి కలెక్టర్ విషయం తెలుసుకోగా మందులు లేవని చెప్పాడు. వెంటనే కలెక్టర్ డీఎంహెచ్‌వోకు ఫోన్‌చేసి జిల్లాలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు కావాల్సిన మందులు తెప్పించాలని ఆదేశించారు. తహసీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ సఫియొద్దీన్, ఎంపీడీవో నిరంజన్, ఆర్‌ఐ మల్లికార్జునరావు, ఏపీవో బి.రమేష్, పంచాయతీ కార్యదర్శులు కలెక్టర్ వెంట ఉన్నారు.

గుండాల: గుండాలలోని కస్తూర్బా, ఆదర్శ పాఠశాలలను శుక్రవారం అదనపు కలెక్టర్ గంగాధర్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వంట గదులు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు ఏమైన సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సురేశ్‌కుమార్, కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, ఎంపీవో ధనుంజయ్ తదితరులున్నారు.

భువనగిరి అర్బన్: సుదీర్ఘ కాలంగా దళితులు కబ్జాలో ఉన్న భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు భట్టు రామచంద్రయ్య కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ హనుమంతు కే.జెండగేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోత్కూరు మండలం ముశిపట్ల సర్వే నెం.194లోని 1.28 ఎకరాల్లో గత 30 ఏళ్లుగా కబ్జాలో ఉన్నారని తెలిపారు. ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా ఆ భూమి రికార్డుల్లో నమోదు కానుందున గ్రామానికి చెందిన బిల్లపాటి యాదిరెడ్డి, మాధవరెడ్డి, కొప్పుల వెంకటిరెడ్డిలు దౌర్జన్యంగా ఆక్రమించాలని చూస్తున్నారని ఆరోపించారు. సమగ్రంగా విచారణ జరిపి దళితులకు రావాల్సిన పాస్‌పుస్తకాలు ఇవ్వాలన్నారు. వినతిపత్రం అందజేసినవారిలో గ్రామస్థులు మల్లయ్య, కిష్టయ్య, యాదమ్మ ఉన్నారు.

ప్రభుత్వ భూములు పరిరక్షించాలి

మోత్కూరు: మోత్కూరు చెరువు శిఖం సర్వే నెం.431లో అన్యాక్రాంతమైన 534 గజాల స్థలంతోపాటు, ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని కోరుతూ మోత్కూరు మునిసిపాలిటీ అఖిలపక్షం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతి పత్రం అందజేశారు. వెంటనే స్పందించిన కలెక్టర్ అన్యాక్రాంతమైన చెరువు శిఖం భూమిపై విచారణ జరిపిస్తామని, ఆ భూమిపై కోర్టు ఆర్డర్లు ఉన్నా చెల్లవని కలెక్టర్ చెప్పారని అఖిల పక్ష నాయకులు విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం నర్సింహ, అవిశెట్టి అవిలిమల్లు, గుండగోని రామచంద్రు, బయ్యని రాజు, అన్నెపు వెంకట్, మరాఠి అంజయ్య, గడ్డం లక్ష్మయ్య, పుల్కరం మల్లేష్, ఎస్.మనోహర్ పాల్గొన్నారు.

బీసీలను విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం సరికాదు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనంలో ఉద్రిక్తం

భువనగిరి టౌన్, జూలై 26: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను విస్మరించాయని బీసీ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లను నిరసిస్తూ బీఆర్‌ఎస్, బీసీ విద్యార్థి సంఘం తదితర సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వాల దిష్టిబొమ్మల దహనం ప్రయత్నంలో శుక్రవారం భువనగిరిలో ఉద్రిక్తం నెలకొంది. ఆందోళనకారులు ప్రభుత్వాల దిష్టిబొమ్మలతో ఊరేగింపు నిర్వహించి దహనం చేసే ప్రయత్నాలు చేస్తుండగా పోలీసులు దిష్టిబొమ్మలను లాక్కునే ప్రయత్నాలు చేశారు. దీంతో ఒక్కసారిగా ఉద్విగ్న పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వాలు, పోలీసులకు వ్యతిరేకంగా ఆందోళనకారులు నినాదాలతో హోరెత్తించారు. అయినప్పటికీ ఆందోళనకారులు దిష్టిబొమ్మలను దహనం చేయగా, పోలీసులు కొద్దిమందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోఎదీ రాందేవ్ మాట్లాడుతూ రెండు బడ్జెట్‌లు బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయని, విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశాయని, ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమాన్ని విస్మరించాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు భట్టు రాంచంద్రయ్య, దిడ్డికాడి భగత్, సిరిపంగ సుభాష్, తుమ్మేటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

- ఫుడ్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



బీబీనగర్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

బీబీనగర్, జూలై 26: గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఫుడ్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం బీబీనగర్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను కమిషన్ చైర్మన్ సభ్యులతో కలిసి ఆకస్మికంగా తనిఖీచేశారు. వంటశాల గది, డైనింగ్ హాల్‌ను విద్యార్థులకోసం సిద్ధం చేసిన వంటలను పరిశీలించారు. అనంతరం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో మాట్లాడి సమస్యలు, అందిస్తున్న వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. వైద్యురాలు, సిబ్బందితో మాట్లాడి ఓపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడి అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం పెడుతున్నారా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే దేశం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు ఆనంద్, శారద, జ్యోతి, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అదనపు డీఆర్‌డీవో సురేశ్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, గురుకుల వసతి గృహాల రీజినల్ కో ఆర్డినేటర్ రజిని, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

ఆరోగ్య తెలంగాణ కోసం కృషి చేయాలి

భువనగిరి అర్బన్: పిల్లల బంగారు భవిష్యత్‌కోసం ఆరోగ్య తెలంగాణగా మార్చేందుకు అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉందని గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అధికారులతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. సంక్షేమ కార్యక్రమాల పట్ల జిల్లా యంత్రాంగానికి మంచి అవగాహన ఉందన్నారు. నోడల్ అధికారులు తరచూ పాఠశాలలు, వసతి గృహాలు, ఆస్పత్రులను తనిఖీ చేయాలన్నారు. కలెక్టర్ హనుమంతు కే. జెండగే మాట్లాడుతూ మండల ప్రత్యేక అధికారులు, నోడల్ అధికారులు తరచూ తనిఖీలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఫుడ్ కమిషన్ సభ్యులు ఆర్.శారద, వి. ఆనంద్ మాట్లాడారు. సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే. గంగాధర్, అదనపు డీఆర్డీవో సురేష్, వివిధ సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సైనికులు దేశ భక్తికి ప్రతీక

ఆర్మీ కళాశాల డైరెక్టర్ కెప్టెన్ రాఖీ చౌహాన్



సైనికుడిని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

బీబీనగర్, జూలై 26: సైనికులు దేశభక్తికి నిలువెత్తు ప్రతీకలని ఆర్మీ కళాశాల డైరెక్టర్ కెప్టెన్ రాఖీ చౌహాన్ అన్నారు. శుక్రవారం బీబీనగర్ పట్టణ శివారులోని సాంఘిక సంక్షేమ ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాలలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాఖీ చౌహాన్ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో వందలాది మంది భారత సైనికులు దేశ రక్షణకోసం తమ ప్రాణాలను త్రుణప్రాయంగా అర్పించారని కొనియాడారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సైనికులను కళాశాల అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా క్షేత్ర ప్రచార అధికారి కోటేశ్వర్‌రావు, ఆర్మీ కళాశాల ప్రిన్సిపల్ పాండు రంగ శర్మ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఎనిమిది గొర్రెలు మృతి

గరిడేపల్లి, జూలై 26 : సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో లారీ ఢీకొని ఎనిమిది గొర్రెలు మృతి చెందాయి. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం రాయినిపాలెం గ్రామానికి చెందిన పసులేటి బోడయ్య తన గొర్రెల మందను కీతవారిగూడెం నుంచి రాయినిపాలెం వైపు కోదాడ ప్రధాన రహదారిపై తీసుకెళ్తుండగా అప్పన్నపేట గ్రామశివారులో మిర్యాలగూడ నుంచి ఒడిషాకు బియ్యం లోడుతో వెళ్తున్న లారీ కిందకు భయంతో ఒక్కసారిగా గొర్రెలు దూసుకెళ్లాయి. ఈ ఘటనలో ఎనిమిది గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సైదులు తెలిపారు.

వైభవంగా ఊంజల్ సేవ

భువనగిరి అర్బన్, జూలై 26: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. పాంచరాత్రాగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో అండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు సంప్రదాయ రీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరస్వామి వారికి నిత్యపూజలు, యాగశాలలో చండీహోమం చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.9,43,076ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేదపండితులు వేద ఆశీర్వచనం అందజేశారు.



ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

నేడు యాదగిరిగుట్టలో కోర్టు ప్రారంభం

యాదగిరిగుట్ట తులసీ కాటేజీలో కొత్తగా జూనియర్ సివిల్ జడ్జి, మొదటి శ్రేణి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టును శనివారం హైకోర్టు న్యాయమూర్తులు ఈ.వీ.వేణుగోపాల్, టీ.వినోద్‌కుమార్, కే.లక్ష్మణ్, కే.సుజన ప్రారంభిస్తారని జిల్లా న్యాయాధికారి జయరాజు శుక్రవారం తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుడు మట్టారెడ్డి మృతి

పెన్‌పహాడ్, జూలై 26: సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు భైరెడ్డి మట్టారెడ్డి(105) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెం దారు. ఆయనకు భార్య అచ్చమ్మతో పాటు ఐదుగురు కుమారులు వెంకటనారాయణ, మధుసూదన్‌రెడ్డి, కేశవరెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఇద్దరు కుమార్తె కళమ్మ, అనంతమ్మ ఉన్నారు. కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి సర్పంచ్‌గా పనిచేశారు. మరో కుమారుడు వెంకటనారాయణ గతంలోనే మృతిచెందాడు. మట్టారెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తూముల భుజంగరావు, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, పీఏసీఎస్ చైర్మన్లు నాతాల జానకిరాంరెడ్డి, వెన్న సీతారాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ మామిడి రేవతిపరంధాములు, ఎత్తిపోతల పథకం మాజీ చైర్మన్ ధనియాకుల సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు భైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, దంతాల వెంకటేశ్వర్లు, మామిడి శ్రీనివాస్, గజ్జెల సైదిరెడ్డి, సతీష్ నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు.



మట్టారెడ్డి(ఫైల్)

చోరీ చేసి.. సొంత పొలాల్లో దాచి

భువనగిరి రూరల్, జూలై 26: వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్లు, పాత ఇనుప పైపులు, కేబుల్ వైరు తదితర సామాగ్రిని అపహరించి కొందరు వ్యక్తులు తమ బావుల వద్ద దాచి ఉంచిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం వీరవెల్లి గ్రామానికి చెందిన నోముల శ్రీశైలం, రేగు మల్లేశ్, దయ్యాల నరేశ్ గ్రామంలోని పలువురు రైతులకు సంబంధించి బోరు మోటార్లను, కేబుల్ వైర్లు, పాత ఇనుప పైపులను గుట్టు చప్పుడు కాకుండా అపహరించుకుపోయి తమ బావి వద్ద దాచి పెట్టారు. అయితే గత ఆరు నెలల నుంచి గ్రామంలో బోరు మోటార్లు తదితర వ్యవసాయ పరికరాలు మాయమవుతున్నాయి. కాగా బాధిత రైతులు పోలీసులకు గతంలో ఎన్నోసార్లు ఈ సంఘటనకు సంబంధించి ఫిర్యాదు చేశారు. అయితే నోముల శ్రీశైలం వ్యవసాయ బావి వద్ద బోరు మోటార్లు, ఇనుప పైపులు తదితర దొంగిలించిన సామాగ్రిని గుర్తించి ఓ రైతు ఈ విషయమై గ్రామస్థులకు చెప్పడంతో వారంతా రూరల్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో సమాచారం అందుకున్న భువనగిరి రూరల్ ఎస్ఐ వి సంతోష్‌కుమార్ గ్రామంలో పరికరాలు దాచి ఉన్నప్రదేశానికి వెళ్లి అక్కడ ఉన్న సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దొంగతనానికి పాల్పడినట్లు అనుమానిస్తున్న నోముల శ్రీశైలం, రేగు మల్లేశ్, దయ్యాల నరేశ్‌లను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌లో విచారిస్తున్నారు. గతంలో వీరిపై పలు దొంగతనాలు కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు.



చోరీ చేసిన బోరు మోటార్లు

గేయవర్షిణికి కళారత్న అవార్డు

మిర్యాలగూడ టౌన్, జూలై 26: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన విద్యార్థిని గుంటూరు గేయవర్షిణి ప్రతిష్టాత్మక జాతీయ కళారత్న అవార్డుకు ఎంపికైంది. 30వేల బియ్యపు గింజలపై లక్ష్మీనరసింహ నామాన్ని రాసి భక్తి పారవశ్యాన్ని చాటిన గేయవర్షిణిని కళారత్న అవార్డుకు బహుజన సాహిత్య అకాడమీ ఎంపిక చేసింది. ప్రతీ ఏటా ఆధ్యాత్మిక విభాగాల్లో అవార్డులు అందజేసే బీఎస్‌ఏ మైక్రో లెటర్స్ రైటింగ్ విభాగంలో గేయవర్షిణికి జాతీయ కళారత్న అవార్డు అందించనుంది. సెప్టెంబరు 5న ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి క్షేత్రంలో నిర్వహించే ఆధ్యాత్మికోత్సవంలో అవార్డు అందజేయనున్నారు. ఈ సందర్భంగా బీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ గేయవర్షిణి తల్లిదండ్రులు గుంటూరు శ్రీనివాస్, శ్రీలక్ష్మిలను అభినందించారు.



బియ్యపు గింజపై నామాలు రాస్తున్న గేయవర్షిణి

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

కోదాడ రూరల్, జూలై 26: గుట్కా ప్యాకెట్లను తరలిస్తుండగా ఆటోను సీజ్ చేసి ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట జిల్లా కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఆంధ్రప్రదేశ్ సరిహద్దున ఉన్న నల్లబండగూడెం, రెడ్లకుంట, కూచిపూడి, దొరకుంటతో పాటు పలు గ్రామాలకు ఆంధ్రా ప్రాంతానికి చెందిన గుట్కా వ్యాపారి నందుల రాజా తన ఆటో ద్వారా గుట్కా ప్యాకెట్లు సరఫరా చేస్తున్నాడు. శుక్రవారం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద గల పాన్‌షాప్‌లో విక్రయిస్తుండగా దాడి చేసి ఆటోలో ఉన్న రూ.8 వేలు విలువైన గుట్కాప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వ్యాపారి నందుల రాజాపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా ఏపీలోని జగ్గయ్యపేటకు చెందిన జంగిలి వెంకటేశ్వర్లు కూడా తన ఆటోలో గుట్కా ప్యాకెట్లు తీసుకుని నల్లబండగూడెం గ్రామంలో విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అతడి నుంచి ఆటోతో పాటు రూ.2 వేల విలువైన గుట్కాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. జంగిలి వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆంధ్రా ప్రాంతంలో గుట్కా, అంబర్ ప్యాకెట్లపై నిషేధం లేకపోవడంతో అక్కడి వ్యాపారులు తెలంగాణలో కూడా ఆటోల ద్వారా పాన్‌షాప్‌లకు పెద్దఎత్తున విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గుట్కా, పొగాకు ఉత్పత్తులపై ఉక్కుపాదం మోపడంతో పోలీసులు దాడులు నిర్వహించి రూ.10 వేల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

ప్రగతి పల్లెవించేనా?

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. ఈ ఏడాది జనవరి 31తో సర్పంచ్‌ల పదవీకాలం ముగియగా, ఈ నెల 2వ తేదీతో ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం ముగిసింది. దీంతో క్షేత్రస్థాయిలో పల్లెల్లో పాలన అధికారుల చేతుల్లోకి వెళ్లింది. అయితే వారు క్షేత్రస్థాయిలోకి వెళ్లడం లేదన్న విమర్శలు ఉన్నాయి. చిన్న చిన్న పనులు కూడా నిధుల్లేక పూర్తిచేయలేకపోతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. వెరసి పల్లెలు సమస్యలతో తల్లడిల్లుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)/దేవరకొండ,ఆలేరురూరల్,భువనగిరిరూరల్, చౌటుప్పల్

- మొదలైన ప్రత్యేక అధికారుల పాలన
- క్షేత్రస్థాయిలో పర్యవేక్షించని అధికారులు
- నామమాత్రంగా బాధ్యతల నిర్వహణ
- నిధులు లేక నిలుస్తున్న పనులు
- పారిశుధ్యం నిర్వహణ, మౌలిక వసతుల ఏర్పాట్లపై తీవ్ర ప్రభావం
- పలు పనుల కోసం సొంత డబ్బులు వెచ్చిస్తున్న కార్యదర్శులు



మోటకొండూరులో చిత్తడిగా మారిన సెయింట్ పీటర్ స్కూల్ మార్గం

ఆంధ్రజ్యోతి విజిట్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని గ్రామాల్లో సమస్యలు తిష్ఠవేశాయి. పలు గ్రామాల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. ఒక రోజు మిషన్ భగీరథ నీటిని అందిస్తే నాలుగు రోజుల దాకా రావడం లేదు. అయినా పట్టించుకునే వారేలేరు.పల్లెలతో పాటు మండల కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రధానంగా పారిశుధ్య లోపం ఉంది. డ్రైనేజీ కాల్వల్లో పూడికతీత,ఇతర పారిశుధ్య నిర్వహణపై పర్యవేక్షణ కరువైంది. పూడిక నిండిన మురుగు కాల్వలు, మురుగు కుంటలు, చెత్త కుండీలు, డంపింగ్ యార్డులు లేక ఎక్కడ పడితే అక్కడ పేరుకపోయిన చెత్తాచెదారంతో దోమల వ్యాప్తి పెరిగింది.

సూర్యాపేట జిల్లాలోని 475 గ్రామపంచాయతీల్లో స్పెషల్‌అధికారుల పాలన కొనసాగుతోంది. పలు పంచాయతీలకు ఇన్‌చార్జీ కార్యదర్శులు ఉన్నారు. కొత్తగా ఏర్పాటైన గ్రామపంచాయతీల్లో 60 దాకా ఎస్టీ జనాభాతో కూడినవే ఉన్నాయి. పారిశుధ్యం లోపించి ఇటీవల హుజూర్‌నగర్, పెన్‌పహాడ్, మఠంపల్లి మండలాల్లో విషజ్వరాలు ప్రబలాయి. అంతర్గత రహదారులు గుంతలమయమై కొద్దిపాటి వర్షం వచ్చినా నీరు నిలిచి చిత్తడిగా మారుతున్నాయి. రాకపోకలకు అసౌకర్యంగా ఉన్నాయి. వీధిదీపాలు ఉన్నా నిర్వహణ సరిగా లేక పలు గ్రామాల్లో అంధకారం నెలకొంది.

నిధుల కొరతతో అరకొరగా సమస్యల పరిష్కారం

పంచాయతీలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. పంచాయతీల నిర్వహణ కోసం ప్రత్యేక అధికారులను నియమించిన ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో పంచాయతీల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. సమస్యలను అరకొరగా పరిష్కారం అవుతున్నాయి. కొన్నిచోట్ల గ్రామకార్యదర్శులు అప్పులుచేసి పనులు చేపడుతున్నారు. దేవరకొండ నియోజకవర్గంలో 215 గ్రామపంచాయతీలు ఉన్నాయి. పంచాయతీలకు నిధులు కేటాయించకపోవడంతో సమస్యలను అధికారులు పరిశీలించడంలో జాప్యం జరుగుతోంది. పంచాయతీలకు చెందిన ట్రాక్టర్ల నిర్వహణ ఖర్చు నెలకు రూ.7 నుంచి రూ.8 వేల వరకు వస్తుంది. దీంతో పాటు బ్లీచింగ్ పౌడర్ కొనుగోలుకు కూడా నిధులు లేకపోవడంతో తామే సర్దుబాటు చేస్తున్నామని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. స్టేట్ ఫైనాన్స్ నిధులు, కేంద్రం నిధులు పంచాయతీలకు కేటాయించలేదు. దీంతో గ్రామాల్లో కాలువల మరమ్మతులు, నూతన కాల్వల నిర్మాణం, రోడ్లు, మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యలను అడిగి తెలుసుకొని కంపచెట్లు తొలగించడం, చిన్న, చిన్న సమస్యలను పరిష్కరిస్తున్నారు. నిధులులేకపోవడంతో అభివృద్ధి పనులను చేపట్టడంలేదు.

- చింతపల్లి మండలకేంద్రంలోని బీసీ కాలనీలో 10 రోజుల కిందట మంచినీటి బోరు మరమ్మతులకు గురైంది. కాలనీవాసులు గ్రామకార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా నిధుల్లేక మరమ్మతులు చేయడానికి ఐదు రోజులు పట్టింది. విధిలేని పరిస్థితిలో కాలనీవాసులు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి తెచ్చుకున్నారు.
- దేవరకొండ మండలం కొండభీమనపల్లి ఎస్సీ కాలనీలో పారిశుధ్యం లోపించిందని, కాల్వలు ధ్వంసమయ్యాయని, నీటి ట్యాంక్ లీకై నీరు వృథాగా పోతుందని ప్రజావాణిలో కాలనీవాసులు ఎంపీడీవోకు ఫిర్యాదుచేశారు. అయితే నిధుల లేమితో సమస్యలు పరిష్కారం కాలేదు.

చుట్టపు చూపుగా గ్రామాల్లో పర్యటన

ఆలేరు నియోజకవర్గంలో ఆలేరు, మోటకొండూరు, ఆత్మకూరు, గుండాల, యాదగిరిగుట్ట, రాజాపేట, తుర్కపల్లి, బొమ్మలరామారం కలిపి ఎనిమిది మండలాలు ఉన్నాయి. మొత్తం 186 గ్రామపంచాయతీలు ఉండగా 50 కిపైగా తండాలు, ఆవాస గ్రామాలు ఉన్నాయి. నియోజకవర్గంలో పెద్ద గ్రామపంచాయతీలకు ఒకరు చొప్పున రెండు మూడు చిన్న గ్రామాలకు ఒకరు చొప్పున ప్రత్యేక అధికారులను నియమించారు. ప్రత్యేక అధికారులు తమవిధులను నిర్వర్తించలేక గ్రామాలను సందర్శించలేక చుట్టపు చూపుగా వచ్చిపోతున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. నిధుల్లేక పోవడంతో పనులు పడకేశాయి. పలు గ్రామపంచాయతీల్లో కొన్ని నెలలుగా సిబ్బందికి వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. అక్కడక్కడా పంచాయతీ కార్యదర్శులే ఆర్థిక వనరులను సమకూరుస్తూ నెట్టుకువస్తున్నారు. దీంతో వారిపై మోయలేని ఆర్థిక భారం పడుతోంది. సర్పంచ్‌లు స్థానికంగా ఉండేవారని తమ సమస్యలు చెప్పుకొని పరిష్కరించుకునే వారమని ప్రత్యేక అధికారులు స్థానికంగా ఉండకపోవడంతో, సమయానికి రాకపోవడంతో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని అంటున్నారు.

భువనగిరి నియోజకవర్గంలో ఐదు నెలలుగా ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలు పలు సమస్యలతో సతమతమవుతున్నాయి. భువనగిరి నియోజకవర్గంలో 126 పంచాయతీలున్నాయి. ప్రతీ పంచాయతీకి ఒక మండల స్థాయి అధికారిని నియమించారు. అయితే సర్పంచ్‌లు ఉన్న సమయంలో గ్రామసమస్యలను గుర్తించి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ నిధులను మంజూరు చేయించుకుని గ్రామాభివృద్ధికి కృషి చేసేవారు. ప్రత్యేకాధికారులు వారానికి రెండుసార్లు గ్రామాన్ని సందర్శించి సమస్యలు తెలుసుకుని పైఅధికారులకు నివేదికలు అందజేస్తున్నా నిధుల లేమితో, చుట్టపు చూపుగా వచ్చిపోతూ నామమాత్రంగా ఉండడం.. అనంతరం తమ శాఖ పరమైన విధుల్లో నిమగ్నం అవుతుండటంతో గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా మారింది.

చౌటుప్పల్ మండలంలో ప్రత్యేక అధికారుల పాలనలో కొన్ని గ్రామాల్లో సమస్యలు పరిష్కారం అవుతుండగా, మరికొన్ని సమస్యలు తిష్ఠ వేశాయి. ప్రత్యేక అధికారులు ఆయా గ్రామాలపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ పెట్టకపోవడం తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగైదు రోజులుగా వరుసగా ముసురుతోవర్షం పడుతుండడంతో మురుగు కాల్వల పూడికతీతను పట్టించుకునే వారు కరువయ్యారు. కొన్ని గ్రామాల్లో చెత్త ట్రాక్టర్లు ఆటోలు వారానికోసారి తిరుగుతున్నాయి. దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకు న్న దాఖలాలు కనిపించడం లేదు. గ్రామాలలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. కొన్ని గ్రామాలకు నియమించిన ప్రత్యేక అధికారులు బదిలీలపై వెళ్లడంతో ఆయా గ్రామాల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. దీంతో కొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.



చింతపల్లి బీసీ కాలనీలో మురుగు కాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారం



కొండభీమనపల్లిలో శిథిలావస్థలో కాల్వ, ఏపుగా పెరిగిన కంపచెట్లు

సమస్యలను పరిష్కరిస్తున్నాం



గ్రామాల్లోని ప్రధాన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూనే ఉన్నాం. పంచాయతీ కార్యదర్శులు ప్రజాసమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తున్నారు. ప్రజావాణిలో ఫిర్యాదులను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తున్నారు.

- రాంమోహన్‌రావు, దేవరకొండ డివిజన్ పంచాయతీ అధికారి.

సంపు లీకేజీలను అరికట్టాలి



కొండభీమనపల్లిలోని బీసీకాలనీ నుంచి మురుగునీరు వాటర్ సంపు వద్దకు చేరుకొని నిల్వ ఉంటోంది. నీరు నిల్వ ఉండకుండా కాల్వలను పునరుద్ధరించాలి. వాటర్ సంపు లీకేజీని అరికట్టాలి. కంపచెట్లను తొలగించి సమస్యను పరిష్కరించాలి.

- ఎర్ర ఆంజనేయులు, కొండభీమనపల్లి, దేవరకొండ మండలం.

డ్రైనేజీ సమస్యపై ఫిర్యాదు చేశాం

చింతపల్లి మండలకేంద్రంలోని బీసీ కాలనీలో చెత్తాచెదారం పేరుకుపోయి కాల్వలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. దోమల బెడద అధికమైంది. ప్రజావాణిలో ఫిర్యాదులు చేశాం. పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తే నిధులు మంజూరైన తరువాత సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

- రమేష్‌యాదవ్,చింతపల్లి.



భువనగిరి మండలం రామకిష్టాపురంలో రోడ్డు పక్కన మురుగు నీరు

ముసురుకుంటున్న వ్యాధులు



మాడ్గులపల్లి మండలం కన్నెకల్‌లో ఆరోగ్య విషయాలు వివరిస్తున్న నల్లగొండ జిల్లా మలేరియా అధికారి

మిర్యాలగూడ : పల్లెల్లో మురుగు కాల్వల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో ప్రజారోగ్యం దెబ్బతింటోంది. మాడ్గులపల్లి మండలం కన్నెకల్‌లో నెల రోజులుగా విషజ్వరాలు ప్రబలి ఊరంతా మంచం పట్టడంతో వైద్యాధికారులు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించి, మురుగుకాల్వలపై, మురుగుగుంతలపై బ్లీచింగ్ చల్లించి దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయించాల్సి వచ్చింది. వేములపల్లి మండలంలో పారిశుధ్య పనులు కొనసాగడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్ల వెంట పెరిగిన కంపచెట్ల తొలగింపు చేపట్టడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. అడవిదేవులపల్లి మండలంలో ముదిమాణిక్యంలో బోర్లు పనిచేయక తాగు నీటి ఎద్దడితో సమస్యలను ఎదుర్కొంటున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

60 మంది ప్రత్యేక అధికారులు

మిర్యాలగూడ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 136 పంచాయతీలు ఉన్నాయి. సుమారు 60మంది ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. పంచాయతీ కార్యదర్శులపై ఆధారపడి గ్రామపాలనను కొనసాగిస్తున్నారు. పంచాయతీల్లో గత సర్పంచ్‌ల కాలంలో మిగులు నిధులుంటే స్పెషలాఫీసర్ అనుమతితో కార్యదర్శులు అవసరాలకు వినియోగిస్తున్నారు. మిగులు లేని చోట్ల కార్యదర్శుల జీతాల నుంచి డబ్బులు వెచ్చించి పనులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. రైతుల బోర్లు అద్దెకు తీసుకున్న చోట ప్రభుత్వం రైతుల ఖాతాలో డబ్బులు జమ చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న జీపీ వర్కర్ల వేతనాలు జూలై మొదటి వారంలో విడుదల చేశారు. వీధి లైట్ల ఏర్పాటు, తాగునీటి సరఫరా పైపుల లీకేజీ మరమ్మతుల పనులు, బోరు మోటార్ల రిపేర్లు, ప్రజారోగ్యానికి సంబంధించి నిధులు విడుదల చేయకపోవడంతో పనులు కాక ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు.

బదిలీలతో ఖాళీలు



చిననెమిల గ్రామంలో ఇళ్ల మధ్య నిలిచిన నీరు

మోత్కూరు: పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్న తరుణంలోనే ఉద్యోగుల బదిలీలు జరిగాయి. ఈ నేపథ్యంలో కొందరు అధికారులు బదిలీపై వెళ్లడంతో కొన్ని గ్రామాలకు ప్రత్యేక అధికారులే లేకుండాపోయారు. పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సెలవుపై వెళ్లడం, బదిలీ కావడం తదితర కారణాలతో ఇన్‌చార్జి కారదర్శులతో వెళ్లదీస్తున్నారు. దీంతో పాలన అస్తవ్యస్తంగా తయారైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని తొమ్మిది మండలాల్లో 154 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మోత్కూరులో 10 గ్రామపంచాయతీలు ఉండగా అందులో 3 చోట్ల రెగ్యులర్ కార్యదర్శులు లేరు. దాచారం ప్రత్యేక అధికారిగా ఉన్న ఎంపీడీవో మనోహర్‌రెడ్డి పదవీవిరమణ చేశారు. మరో రెండు గ్రామాలకు ప్రత్యేక అధికారులుగా ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పీఆర్ ఏఈ బదిలీ వెళ్లడంతో మూడు గ్రామాలకు ప్రత్యేక అధికారులు లేరు. దాచారం ఇన్‌చార్జి కార్యదర్శి రాక, ప్రత్యేక అధికారి లేక గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. సంతకాలు చేసి నిధులు డ్రా చేసే అధికారులు లేక సిబ్బందికి ఆరు మాసాలుగా వేతనాలు అందక వారు నానా ఇబ్బందులు పడుతున్నారు. శాలిగౌరారం మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. రెండు గ్రామాల కార్యదర్శులు సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జి కార్యదర్శులతో నడుస్తున్నాయి. మూడు గ్రామాలకు ప్రత్యేక అధికారులుగా ఉన్న అధికారులకు బదిలీ కావడంతో ఆ గ్రామాలకు ప్రత్యేక అధికారులు లేకుండాపోయారు. అడ్డగూడూరు మండలంలో 17 గ్రామపంచాయతీలు ఉండగా మూడు గ్రామపంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులు ఉన్నారు. తుంగతుర్తి మండలంలో 24 గ్రామపంచాయతీలు ఉండగా రెండు గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులు లేక ఇన్‌చార్జిల పాలనలో ఉన్నాయి. మద్దిరాల మండలంలో ఒక పంచాయతీకి ఇన్‌చార్జి కార్యదర్శి ఉన్నారు. ఇలా అన్ని మండలాల్లో ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి.

1.50అడుగులు పెరిగిన సాగర్ నీటిమట్టం

- 505.60 అడుగులకు చేరుకున్న సాగర్ జలాశయం
- ఎగువనుంచి 45,236 క్యూసెక్కుల వరద

నాగార్జునసాగర్/కేతేపల్లి/మేళ్లచెర్వు, జూలై 26: నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం శుక్రవారం సాయంత్రానికి 505.60 అడుగులకు(124.3222 టీఎంసీలు) చేరుకుంది. గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి 504.10 అడుగులుగా (121.8709 టీఎంసీలు) ఉన్న సాగర్ నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి 1.50 అడుగుల మేర పెరిగి 505.60 అడుగులకు చేరింది. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 9,921 క్యూసెక్కులు, ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు మొత్తంగా శ్రీశైలం నుంచి 45,236 క్యూసెక్కుల నీరు సాగర్ జలాశయానికి చేరుతోంది. దీంతో సాగర్ నీటి మట్టం ఒక్క రోజులో 1.50అడుగులు పెరిగింది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 5,700 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 6,500 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువనుంచి 45,236 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ నుంచి ఎడమ, వరద కాల్వలకు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ఎలాంటి నీటి విడుదల లేదు.



వరద నీటితో నిండుకుండలా ఉన్న నల్లగొండ జిల్లా కేతేపల్లి పరిధిలోని మూసీ జలాశయం

642అడుగులకు చేరిన మూసీ నీటిమట్టం

ఎగువ ప్రాంతాలనుంచి ఇన్‌ఫ్లో నిరంతరాయంగా కొనసాగుతుండడంతో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలోని మూసీ ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. 645అడుగుల(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి 642.20అడుగులుగా (3.74టీఎంసీ) నమోదైంది. ఎగువనుంచి ప్రాజెక్టులోకి 790 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగు నిమిత్తం ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు 211 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

'పులిచింతల'కు 301క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలోని పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 175 అడుగులు (45.77 టీఎంసీలు) కాగా, శుక్రవారం సాయంత్రానికి 102.88 అడుగులుగా(1.03టీఎంసీలు) నమోదైంది. ఎగువనుంచి 301 క్యూసెక్కుల వరద వస్తుండగా, దిగువకు నీటి విడుదల లేదు.

దేశసేవలో భాగమై.. అనారోగ్యంతో పోరాడి..

- అసోంలో ఆర్మీ అగ్నివీర్ మృతి
- స్వగ్రామం నల్లగొండ జిల్లాలో విషాదఛాయలు
- నేడు స్వగ్రామంలో అంత్యక్రియలు

హాలియా, జూలై 26: దేశ సేవ చేయాలనే సంకల్పం.. సోదరుడి స్ఫూర్తితో అగ్నివీర్‌గా ఎంపికై అసోంలో విధులు నిర్వర్తిస్తున్న ఆ యువకుడు అనారోగ్యంతో కన్నుమూశాడు. నల్లగొండ జిల్లా అనుముల మండలం మదారిగూడెం గ్రామానికి చెందిన ఆర్మీ అగ్నివీర్ ఈరేటి మహేష్‌యాదవ్(24) అసోం రాష్ట్రంలో గురువారం రాత్రి మృతి చెందారు. 2022లో ఆర్మీ అగ్నిపథ్‌కు ఎంపికై అసోం రాష్ట్రంలోని దబీర్‌ఘాట్ ప్రాంతంలో భద్రత దళాల్లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 9వ తేదీన తీవ్ర జ్వరం, ఛాతిలో నొప్పితో తీవ్ర అస్వస్థతకు గురైన మహేష్‌ను అధికారులు సైనిక ఆస్పత్రికి తరలించగా అక్కడ వారం రోజులు వైద్యచికిత్సలు చేశారు. పరిస్థితి విషమించడంతో మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా 17రోజులపాటు అనారోగ్యంతో పోరాడి గురువారం రాత్రి మృతి చెందాడు.

సోదరుడి స్ఫూర్తితో అగ్నివీర్‌గా ఎంపికై...

వ్యవసాయం చేస్తూ జీవిస్తున్న ఈరేటి యాదయ్య, పార్వతమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు కాగా మొదటి కుమారుడు మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. రెండో కుమారుడు నరేష్ ఆర్మీలో ఉండగా, మహేష్ మూడో కుమారుడు. నల్లగొండ ఎన్జీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన మహేష్ ఎన్‌సీసీ క్యాడెట్‌గా శిక్షణ పొందాడు. క్రీడలపై మక్కువతో బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఈడీ) పూర్తిచేశాడు. మహేష్‌యాదవ్ అన్న ఈరేటి నరేష్ 2019లో రక్షణరంగం(ఆర్మీ)లో చేరి జమ్ముకశ్మీర్‌లోని మహార్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. సోదరుడిని స్ఫూర్తిగా తీసుకుని దేశానికి సేవ చేయాలనే సంకల్పంతో మహేష్ 2022 సంవత్సరంలో అగ్నిపథ్‌లో భాగంగా అగ్నివీర్‌గా ఎంపికై అసోంలో విధులు నిర్వరిస్తున్నాడు.

15 రోజుల కిందట తల్లితో మాట్లాడి..

ఆరు నెలల క్రితం స్వగ్రామం మదారిగూడెం వచ్చి వెళ్లిన మహేష్‌యాదవ్ 15రోజుల క్రితం తల్లితో ఫోన్‌లో మాట్లాడాడు. కశ్మీర్‌లో ఉంటున్న సోదరుడి భార్య ప్రసవం కోసం మదారిగూడెం రావటంతో ఆ సమయంలో కుటుంబ సభ్యులతో మాట్లాడాడు. సోదరుడు నరేష్ ప్రస్తుతం కశ్మీర్‌లో విధుల్లో ఉన్నారు.



మహేష్ ఇంటి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, మహేష్(ఫైల్‌ఫొటో), అసోంలో శవపేటిక వద్ద నివాళులర్పిస్తున్న ఆర్మీ అధికారులు

నేడు మృతదేహం రాక

ఆర్మీ అగ్నివీర్ మహేష్ మృతదేహాన్ని అసోం రాష్ట్రం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆర్మీ అధికారులు శుక్రవారం రాత్రి సికింద్రాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి తీసుకురానున్నారు. అక్కడ వారి లాంఛనాలు పూర్తి చేసి శనివారం ఉదయం స్వగ్రామం మదారిగూడెం గ్రామానికి తీసుకువచ్చి కుటుంబసభ్యులకు అప్పగించనున్నారు. దేశానికి సేవ చేస్తానంటే ప్రోత్సహించి పంపిస్తే విగతజీవిగా తిరిగి వస్తున్నాడంటూ కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. శనివారం గ్రామంలో మహేష్‌యాదవ్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా శనివారం ఉదయం 7 గంటలకు హాలియా సెంటర్ నుంచి మదారిగూడెం వరకు మృతదేహాన్ని తీసుకెళ్లనున్నారు. ఇంటి వద్ద అధికారులు, ప్రముఖులు నివాళులర్పించనున్నారు.

హత్యాయత్నం చేసిన వ్యక్తులకు జైలు

చింతపల్లి, జూలై 26: హత్యాయత్నం కేసులో ముగ్గురికి పదేళ్ల జైలుతో పాటు రూ.5 వేలు జరిమానా విధించినట్లు నల్లగొండ జిల్లా చింతపల్లి ఎస్ఐ యాదయ్య తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సిరిసనగండ్ల యాదయ్య, జగన్, ఎరుకల రమేష్ కలిసి పాతకక్షలతో అదే గ్రామానికి చెందిన కాటేపాక చంద్రయ్యపై 2014 ఆగస్టు 23న కర్రల, రాళ్లతో హత్యాయత్నం చేశారు. చంద్రయ్య కుమారుడు ఇంద్రకుమార్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ ధనుంజయ్య కేసు నమోదుచేశారు. దేవరకొండ డీఎస్పీలు మనోహర్, చంద్రమోహన్ పూర్తి ఆధారాలతో ఛార్జిషీట్‌ను నల్లగొండ కోర్టులో దాఖలు చేశారు. కోర్టు విచారణలో నేరం నిర్ధారణ కావడంతో ముగ్గురికి ఎస్సీ, ఎస్టీ స్పెషల్ జడ్జి ఎన్.రోజారమణి పదేళ్ల జైలుతో పాటు రూ.5 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్రపవార్ డీఎస్పీ గిరిబాబు, సీఐ నవీన్, ఎస్ఐ యాదయ్యలను అభినందించారు.

ప్రాణాలు నిలిపిన పోలీసులు

కొండమల్లేపల్లి, జూలై 26 : ఆత్మహత్యాయత్నం చేసి అపస్మారకస్థితిలో ఉన్న మహిళను నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి పోలీసులు తమ వాహనంలో తరలించి ప్రాణాలు నిలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండమల్లేపల్లి మండలం అంగోతు తండాకు చెందిన అంగోతు నందు(26) భర్త శ్రీనునాయక్‌తో గొడవ పడి క్షణికావేశంలో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకుంది. తక్షణమే స్పందించిన భర్త వేలాడుతున్న భార్యను చూసి కిందికి దించి వెంటనే గ్రామం నుంచి దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తన బైక్‌పై తీసుకొస్తుండగా మార్గమధ్యలో కొత్తబాయి గేటు సమీపంలో స్థానిక పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. నందు పరిస్థితిని గమనించిన పోలీసులు తమ వాహనంలో ఆమెను చికిత్స దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం నందు ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపినట్లు ఎస్ఐ రాంమూర్తి తెలిపారు. సమయానికి స్పందించిన ఎస్ఐ, కానిస్టేబుల్ మజీద్, రాములకు నందు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి నందును తీసుకువచ్చిన పోలీసులు

పెట్రోల్ బాటిల్‌తో రైతు నిరసన

రామన్నపేట, జూలై 26: తన భూమిలోని కడీలు ధ్వంసం చేశారని ఓ రైతు పెట్రోల్ బాటిల్‌తో తహసీల్దార్ కార్యాలయం ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన నిర్వహించాడు. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నీర్నెముల గ్రామానికి చెందిన బోయిని అంజయ్యకు 3.30ఎకరాల భూమి ఉంది. అంజయ్య దివ్యాంగుడు కాగా కుటుంబసభ్యుల సహకారంతో వ్యవసాయం చేస్తున్నాడు. ఇదే భూమిని సరిహద్దు రైతులు ఆక్రమిస్తున్నారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అంజయ్య ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు భూమిని సర్వే చేయగా, ఆ హద్దురాళ్ల ప్రకారం తన పొలం చుట్టూ కడీలను పాతించాడు. తన భూమిలోని కడీలను సమీప భూముల్లోని రైతులు విరగ్గొట్టి ఇబ్బందులు పెడుతున్నారని అంజయ్య ఆరోపించాడు. దివ్యాంగుడినైన తన భూమిని ఇతరులు ఆక్రమించాలని చూస్తున్నారని, ఈ విషయంపై తహసీల్దార్‌కు పలుమార్లు వినతిపత్రం ఇచ్చానని తెలిపాడు. స్పందించకపోవడంతో శుక్రవారం పెట్రోల్ బాటిల్‌తో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేయాల్సి వచ్చిందని తెలిపాడు. అంజయ్య కుటుంబ సభ్యుల ఆందోళనకు స్థానిక రైతులు, గ్రామస్థులు అండగా నిలిచారు. ఎస్ఐ పి.మల్లయ్య తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని అంజయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడారు. రైతు భూమిలో కడీలు విరగ్గొట్టి వారిపై వెంటనే కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చి, రైతుకు నచ్చజెప్పి నిరసనను విరమింపజేశారు. అనంతరం తహసీల్దార్ లాల్ బహద్దూర్ మాట్లాడుతూ సోమవారం లోగా రైతు సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.



రామన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెట్రోల్ బాటిల్‌తో నిరసన తెలుపుతున్న రైతు అంజయ్య

మోటార్‌పైప్ తీసేందుకు వెళ్లి మృత్యువాత

కోదాడ రూరల్, జూలై 26: సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గుడిబండలో బావిలో పడిపోయిన పైప్ తీసేందుకు వెళ్లి శుక్రవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుడిబండ గ్రామానికి చెందిన కే.నాగరాజు(32) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం గ్రామానికి చెందిన రైతు దేవరపల్లి రమణారెడ్డి తన పొలంలోని బావిలో పడిన మోటార్‌కు సంబంధించిన పైప్‌ను బయటికి తీసేందుకు నాగరాజును తీసుకెళ్లాడు. దీంతో బావిలో దిగిన నాగరాజు నీటిలో మునిగి ఎంతకూ బయటికి రాకపోవడంతో రమణారెడ్డి ఆందోళన చెంది చుట్టుపక్క రైతులు, పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే రైతులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది బావి వద్దకు చేరుకుని మోటార్ ద్వారా బావిలో ఉన్న నీటిని బయటికి తీశారు. అప్పటికే నాగరాజు మృతి చెందాడు. మృతదేహాన్ని బావిలో నుంచి బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించేందుకు పోలీసులు ప్రయత్నించగా, నాగరాజు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కొంతమంది అడ్డుకున్నారు. నాగరాజు కుటుంబానికి ఆర్థిక అందించాలని పట్టుబడ్డారు. మృతదేహంతో బావి వద్దే ఆందోళనకు దిగారు. రూ.5 లక్షలు ఇచ్చేందుకు రమణారెడ్డి అంగీకరించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాగరాజు భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

వేర్వేరు చోట్ల రేషన్ బియ్యం పట్టివేత

కోదాడ రూరల్, జూలై 26 : సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గుడిబండ గ్రామంలో 17 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. కొంతకాలంగా అక్రమంగా రేషన్ బియ్యం వ్యాపారం కొనసాగిస్తున్న వెంకట్రామిరెడ్డి ఇంటిపై గురువారం రాత్రి పోలీసు బృందంతో దాడి చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇంట్లో ఉన్న 17 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. వెంకట్రామిరెడ్డి గ్రామంలో రేషన్ కార్డుదారుల వద్ద నుంచి కిలో రూ.8 చొప్పున కొనుగోలు చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తుంటారని తెలిపారు. గురువారం రాత్రి కూడా వెంకట్రామిరెడ్డి బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా ప్రతి నెల సుమారు 30 నుంచి 40 క్వింటాళ్లకు పైగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుంటాడని గ్రామస్థులు తెలిపారు.

మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెంలో

మిర్యాలగూడ రూరల్, జూలై 26 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం వెంకట్రాదిపాలెంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు రూరల్ ఎస్ఐ నరేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం ఐదు గంటల సమయంలో వెంకటాద్రిపాలెం గ్రామశివారులోని దిలావర్‌పూర్ రోడ్డు వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా ఆటోలో తరలిస్తున్న సుమారు ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. ఆటో డ్రైవర్ ధనావత్ నాగును విచారించగా మండలంలోని ఏడుకోట్లతండా వైపు ఉన్న గ్రామాల్లో రేషన్‌కార్డుదారుల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించేందుకు ఆటోలో తరలిస్తున్నట్లు అంగీకరించాడని తెలిపారు. ఆటోను, బియ్యాన్ని స్టేషన్‌కు తరలించి నాగుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బడ్జెట్‌లో వృత్తిదారులకు మొండి చేయి

● ఎన్నికల హామీలకు బడ్జెట్‌కు పొంతనలేదు
● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు సీతారాములు



పుట్టపాకలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు సీతారాములు

సంస్థాన్ నారాయణపురం, జూలై 26: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వృత్తిదారులకు ప్రభుత్వం మొండిచేయి చూపిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎన్నికల ముందు చేసిన వాగ్దాలకు, వాళ్ల మ్యానిఫెస్టోకి ఏమాత్రం పొంతన లేకుండా ఉందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి లేదన్నారు. బడ్జెట్ అసమానతలతో కూడుకున్నదన్నారు. చేనేత రంగానికి రూ.367కోట్లు కేటాయించినప్పటికీ జీతభత్యాలకే సరిపోదని ఆయన తెలిపారు. ఎన్నికల ముందు వరికి 500 బోనస్ ఇస్తామని చెప్పి సన్న వడ్లకు మాత్రమే ఇస్తామనడం సరికాదన్నారు. అన్ని రకాల వరి ధాన్యానికి మద్దతు ధరతో పాటు బోనస్ ఇవ్వాలని కోరారు. రైతు భరోసాపై స్పష్టత లేదన్నారు. కేంద్రం ప్రభుత్వం రాష్ట్రానికి గుండుసున్నా పెట్టిందన్నారు. దీనిపై సీపీఎం పోరాటం చేస్తుందని తెలిపారు. ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులు డిండి ఎత్తిపోతలు, ఎస్ఎల్బీసీ సొరంగం పూర్తి చేయాలన్నారు. జిల్లాకు చెందిన ఉత్తమ్ కుమార్‌రెడ్డి భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్నారని, ఇకనైనా ప్రాజెక్టులు వేగవంతం చేయాలన్నారు. మూసీ సుందరికరణ తప్ప ప్రక్షాళనకు నిధుల ఊసు లేదన్నారు. సమావేశంలో పార్టీ నల్గొండ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, దోనూరు నర్సిరెడ్డి, బూర్గు కృష్ణారెడ్డి, జీ.శ్రీనివాసచారి, ఎండి పాషా, మర్రి వసంత,గడ్డం వేంకటేష్, దొంతగాని పెద్దులు,తుమ్మల నర్సిరెడ్డి, అయితరాజు గాలయ్య, మధు, రాములు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చేనేతకు రూ.250 కోట్లు కేటాయించాలి: లక్ష్మీనర్సయ్య

మోత్కూరు : రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి ప్రత్యేకంగా రూ.250 కోట్లు కేటాయించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీనర్సయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మోత్కూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో పవర్‌లూమ్‌కు రూ.154 కోట్లు కేటాయించిన ప్రభుత్వం పవర్‌లూమ్ కార్మికులు, చేనేత కార్మికుల సంక్షేమానికి రూ.187కోట్లు కేటాయించిందంటూ అందులో చేనేత రంగానికి ఎంత కేటాయించినట్లో చెప్పాలని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెల్ది రాములు, మండల అధ్యక్షుడు వంగిరి రాములు, నాయకులు జెల్ది సోమయ్య, చుంచు లక్ష్మయ్య, వేముల నర్సయ్య, పెండెం రాజారాం, పసునూరి నారాయణ, పోచం రాజు, రేగోటి సత్యనారాయణ, శ్రీనివాస్, చంద్రమౌళి, మచ్చగిరి ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను సవరించి నిధులు పెంచాలి: వ్యకాస

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పేద, రైతు వ్యతిరేక బడ్జెట్ అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఉపాధి హామీ కూలీలతో కలిసి శుక్రవారం మోత్కూరులో నిరసన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచలేదన్నారు. ఎరువులపై సబ్సిడీ తగ్గించి రైతుల నడ్డివిరిచిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటి సభ్యురాలు రాచకొండ రాములమ్మ, మెతుకు అంజయ్య, కందుకూరి నర్సింహ, అంజమ్మ, గుండు లక్ష్మీ, సవేరా, అలివేలు, మమత, సావిత్రి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి తీవ్ర అన్యాయం: ఎస్ఎఫ్ఐ



భువనగిరిలో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వలిగొండ/ భువనగిరి టౌన్: రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వేముల నాగరాజు మాట్లాడుతూ విద్యారంగానికి కనీసం 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. ఆరు సంవత్సరాలుగా పెండింగులో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఉదయ్‌కుమార్, నరేందర్, మణికంఠరెడ్డి, బిందు, అశ్విత, మనోజ్ పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భువనగిరిలో నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చింతల శివ, నాయకులు ఈర్ల కార్తిక్, ఎండి.నెహాల్, భవానీశంకర్, సతీష్, మహేష్ పాల్గొన్నారు.

దివ్యాంగులను మోసం చేసిన ప్రభుత్వాలు: ఎన్పీఆర్డీ

రామన్నపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు బడ్జెట్ కేటాయింపుల్లో మోసం చేశాయని ఎన్పీఆర్డీ జిల్లా కార్యదర్శి వనం ఉపేందర్ అన్నారు. శుక్రవారం రామన్నపేట మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేసి, బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బల్గూరి అంజనేయులు, కార్యదర్శి గిరికల లింగుస్వామి, ఉపాధ్యక్షుడు నాగు నరసింహ, గట్ల రామ్, శ్రీధర్, యాదగిరి పరుశరాములు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

గుట్ట అభివృద్ధికి నిధులేవీ?: గొంగిడి



విలేకరులతో మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్: దేవస్థానానికి మాజీ సీఎం కేసీఆర్ రూ. 1200 కోట్ల రూపాయాలను కేటాయించి 90 శాతం పనులు పూర్తి చేస్తే, సీఎం రేవంత్‌రెడ్డి గుట్ట అభివృద్ధికి బడ్జెట్‌లో పైసా కేటాయించకపోవడం అన్యాయమని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో ఎక్సైజ్ శాఖకు రూ 25.617 కోట్లు కేటాయించి, గ్రామీణ ప్రాంతాల్లో తాగుబోతులను తయారు చేయడానికి కంకణం కట్టుకుందని అన్నారు. గత ప్రభుత్వం ఎక్సైజ్‌శాఖకు రూ.18.470 కోట్లు కేటాయిస్తేనే గగ్గోలు పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు ఎక్కువగా నిధులు కేటాయించారని ప్రశ్నించారు. గంధమల్ల ప్రాజెక్టును నిర్మాణం చేయిస్తామని, తపాస్‌పల్లి జలాశయం ద్వారా ఆలేరు ప్రాంతానికి సాగునీరు అందిస్తామని ఊకదంపుడు ఉపాన్యాసాలు చేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు రైతులు, ప్రజలకు సమాధానం ఏమని చెపుతారని అన్నారు. బడ్జెట్‌లో నృసింహసాగర్, గంధమల్ల, తపాస్‌పల్లికు నిధులు కేటాయించకపోవడం శోచనీయమని అన్నారు. సమావేశంలో గుట్ట పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మిడి రాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, జిల్లా నాయకుడు వంటేరు సురేష్‌రెడ్డి, పావట్ల నరహరి, గంజి సూర్యనారాయణ పాల్గొన్నారు.

రేషన్‌డీర్లకు సహకారం అందించాలి

భువనగిరి టౌన్, జూలై 26: రేషన్‌డీలర్లకు కేంద్రప్రభుత్వం నుంచి సహకారం అందించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండిజయ్‌ని జిల్లా రేషన్‌డీలర్లు కోరారు. ఈమేరకు రేషన్ డీలర్లు శుక్రవారం బండి సంజయ్‌ని ఢిల్లీలో కలిశారు. రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అందేలా సహకరించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రేషన్ల డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, ఎలగల రాజయ్య, జూకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి నిధుల కేటాయింపుపై హర్షం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎస్సీ సెల్ నాయకులు

చౌటుప్పల్ టౌన్, జూలై 26: రాష్ట్ర బడ్జెట్‌లో దళితుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక నిధులను కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల కమిటీ ఆధ్వర్యంలో చౌటుప్పల్ పట్టణంలోని జాతీయ రహదారిపై సీఎం రేవంత్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఊదరి శ్రీనివాస్, నాయకులు బక్క శ్రీనాథ్, రాచకొండ భార్గవ్, ఎం.శేఖర్, ఇప్ప వెంకటేశ్, లింగస్వామి, నాగరాజు, డి.కృష్ణ, నవీన్, గణేష్, జనార్ధన్, రవి, మహేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి విరాళం

వలిగొండ, జూలై 26: మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి దాత అయిటిపాముల రవీంద్ర రూ.20వేల రూపాయల విరాళాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ, భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి మరింత సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యయులు అలకుంట శ్రీనివాస్, పాఠశాల అమ్మఆదర్శ కమిటీ చైర్మన్ గోవిందమ్మ, ఉపాధ్యాయులు వరమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమాను సద్వినియోగం చేసుకోవాలి

మోటకొండూరు, జూలై 26: అర్హులైన రైతులందరూ రైతు బీమాను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుబ్బారు సుజాత అన్నారు. శుక్రవారం మండలంలోని చాడ రైతు వేదిక క్లస్టర్‌లో రైతులనుండి రైతు బీమా దరఖాస్తులను స్వీకరించారు. కొత్త పట్టాదారు పాసుపుస్తకం వచ్చి రైతు బీమా చేసుకోని వారు ఆగస్టు 5 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముఖేశ్‌కు అభినందనల వెల్లువ

చౌటుప్పల్ రూరల్, జూలై 26: ఇటీవల జాతీయ చేనేత పురస్కార్‌కు ఎంపికైన కొయ్యలగూడెం గ్రామానికి చెందిన యువ చేనేత కళాకారుడు కర్నాటి ముఖేశ్‌ను పలువురు చేనేత ప్రతినిధులు అభినందించారు. శుక్రవారం కొయ్యలగూడెంలో ముఖేశ్‌ను చేనేత ప్రతినిధులు పూలమాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కొయ్యలగూడెం చేనేత ఖ్యాతిని ముఖేశ్ జాతీయస్థాయికి తీసుకెళ్లాడని కొనియాడారు. కార్యక్రమంలో మసనం లక్ష్మయ్య ఫౌండేషన్ చైర్మన్ మసనం శ్రీను, చేనేత ప్రతినిధులు జెల్లా వెంకటేశం, గుర్రం కొండల్, మాచర్ల సంతోష్, కొడి కృష్ణ, గుండు తిరుమలేష్, సంగిశెట్టి రఘు, సతీష్, మసనం సిద్దయ్య, కొడి వెంకట్భూషం, ఆశోక్, కుమార్, గోశిక స్వామి పాల్గొన్నారు.

'జీవో నెం. 50ని రద్దు చేయాలి'

చౌటుప్పల్ టౌన్, జూలై 26: ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.50ని రద్దు చేసి, చౌటుప్పల్ పట్టణంలో సీనియర్ సివిల్ కోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక కోర్టు ఎదుట మూడో రోజు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహంతో పాటు ఆర్డీవో శేఖర్‌రెడ్డి కి వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమాల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్ గౌడ్, అసోసియేషన్ ప్రతినిధులు రాపోలు వేణు, ముత్యాల సత్తిరెడ్డి, తాడూరి పరమేష్, జల్లా రమేష్, పి.మహిపాల్‌రెడ్డి, బాల్యం వెంకటాచలపతి, ఎ.శ్రీనివాస్, వి.నర్సింహారెడ్డి, తడక మోహన్ పాల్గొన్నారు.

తెలంగాణపై కేంద్ర వైఖరిని మార్చుకోవాలి: జహంగీర్

ఆలేరు రూరల్, జూలై 26: తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని మార్చుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ డిమాండ్‌చేశారు. శుక్రవారం మండలంలోని శర్బణాపురంలో జరిగిన మాజీ ఎంపీపీ సూదగాని ఎట్టయ్య 16వ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై సవతి తల్లి ప్రేమను చూపుతోందని అన్నారు. సమాజంలో కొనసాగుతున్న కుల వివక్షతకు వ్యతిరేకంగా అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం ఉద్యమాలు నడిపిన ప్రజా నాయకుడు ఎట్టయ్య అని కొనియాడారు. పార్టీ నాయకులు మాటూరి బాల్‌రాజ్, దూపటి వెంకటేష్, సత్యరాజయ్య. నవీన్, రాజు నర్సయ్య, శ్రీహరి, స్వామి ఉన్నారు.

రామన్నపేట: వలిగొండలో జరిగే సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ పిలుపునిచ్చారు. మండలంలోని సిరిపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యలపై చర్చించి ఉద్యమ కార్యచరణ చేసేందుకు విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేక అశోక్‌రెడ్డి, మాటూరి బాలరాజు, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మాజీ ఎంపీటీసీ బడుగు రమేష్, గణేష్, సత్యం పాల్గొన్నారు.

పథకాలను ప్రజలకు చేరువ చేయాలి: కర్నాటి

భూదాన్‌పోచంపల్లి, జూలై 26: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు కర్నాటి ధనుంజయ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు డబ్బికార్ సాయేష్‌కుమార్, మండల అధ్యక్షుడు గుండ్ల రాజుయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన బీజేపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు దాసరి మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, చేనేత సెల్ జిల్లా కన్వీనర్ గంజి బస్వలింగం, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకు వెంకటేశం, బీజేపీ సీనియర్ నాయకులు నోముల గణేష్, పార్టీ నాయకులు రచ్చ సత్యనారాయణ, బండిరాల సుశీల, గొలనుకొండ ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

రామన్నపేట, జూలై 26: ప్రెస్ క్లబ్ మండల నూతన కార్యవర్గాన్ని రామన్నపేటలో శుక్రవారం ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా బూరుగు వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా శివరాత్రి రమేష్, ఉపాధ్యక్షులుగా ఎండీ.గౌస్, కుకుడాల మహేందర్‌రెడ్డి, కోశాధికారిగా ఎండి.తక్కీయోద్దీన్, సహాయ కార్యదర్శులుగా జీనుకల శ్రీనివాస్, ముత్యాల రమేష్, కార్యవర్గ సభ్యులుగా మీర్జా అర్షద్‌బేగ్, మద్దెగల్ల నర్సింహ, మాంద్ర సత్యనారాయణ, బత్తుల గణేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను పలువురు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎండి.ఇబ్రహీం, ఏటెల్లి శ్రీనివాస్, అప్పం చెన్న కేశ్వర్, కొండ మల్లేష్, లవణం చంద్రశేఖర్, తెలుసురి మల్లేశ్, ఉపేందర్ పాల్గొన్నారు.

సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

భువనగిరి రూరల్, జూలై 26: పంటల సాగులో సస్యరక్షణ పద్ధతులను పాటించి, అధిక దిగుబడులు సాధించాలని రాష్ట్ర పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఎం.మల్లారెడ్డి రైతులకు సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్షేత్రస్థాయి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని చందుపట్ల, వీరవెల్లి గ్రామాల్లో పర్యటించి కంది, వరి, పత్తి పంటలను ఆయన పరిశీలించారు.

డ్రైడే పాటిస్తే ఆరోగ్య భద్రత



పోచంపల్లిలో నిలువనీటిని పారబోస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

భువనగిరి టౌన్/ భూదాన్‌పోచంపల్లి, జూలై 26: ప్రతీ వారం డ్రైడే పాటిస్తూ ఇళ్లలో వృథాగా ఉన్న నిల్వ నీటిని శుభ్రం చేస్తూ దోమల వ్యాప్తిని అరికట్టగలిగితే ఆరోగ్య భద్రత ఉంటుందని మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక 16వ వార్డులో శుక్రవారం నిర్వహించిన డ్రైడేలో ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు మునిసిపాలిటీ చేస్తున్న ప్రయత్నాలకు ప్రజలు సహకరించాలన్నారు. మురికి నీటి గుంటల్లో ఆయిల్ బాల్స్ వేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కమిషనర్ పి రామాంజుల్‌రెడ్డి, కౌన్సిలర్ కడారి ఉమాదేవి, కుషంగుల ఎల్లమ్మ పాల్గొన్నారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భూదాన్‌పోచంపల్లి పట్టణ పరిధిలోని 13వ వార్డులోని హనుమాన్‌వాడ కాలనీలో ఆరోగ్య శాఖ, మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, పీహెచ్‌సీ సీహెచ్‌వో పోతారెడ్డి, సూపర్‌వైజర్లు అరుంధతి, శ్రీదేవి, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మణ్ బాబు, లత, జానకి, మమత పాల్గొన్నారు.

రైతులను మభ్యపెడుతున్న ప్రభుత్వం: కిసాన్‌మోర్చా

భువనగిరి టౌన్, జూలై 26: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చక రైతులను ప్రభుత్వం కల్లబొల్లి మాటలతో మభ్యపెడుతోందని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం భువనగిరిలో జరిగిన మోర్చ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులందరికీ రూ.2లక్షల రుణాలను మాఫీ చేయడంలో ప్రభుత్వం కప్పదాటు వైఖరి అనుసరిస్తోందన్నారు. వరి నాట్ల సీజన్‌లోనే ఫసల్ బీమా యోజనను అమలు చేస్తేనే రైతులకు మేలు జరుగుతుందన్నారు. రైతాంగ సమస్యలపై ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్‌రెడ్డి జిల్లా ఇంచార్జీ అశోక్, జిల్లా అధ్యక్షుడు ఫక్కీర్ రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సురకంటి రంగారెడ్డి, నాయకులు కాల భైరవ, చొక్కారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

భువనగిరి టౌన్, జూలై 26: భువనగిరి రోటరీ క్లబ్, జననీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాచకులకు శుక్రవారం భువనగిరిలో సుమారు 20వేల విలువైన బ్లాంకెట్లు, దుస్తులు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జననీ ఫౌండేషన్ చైర్మన్ పడమటి జగన్మోహన్‌రెడ్డి, పడమటి పాండురంగారెడ్డి, రోటరీ క్లబ్ కార్యదర్శి కె సత్యనారాయణరెడ్డి, శెట్టి బాలయ్య యాదవ్ అశోక్‌గౌడ్, బండారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్ ఆధ్వర్యంలో పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసి ఓ విద్యార్థికి రూ.30వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ జిల్లా గవర్నర్ తాళ్ల రాజశేఖర్‌రెడ్డి, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఎండి.అనిఫ్ ఎమెన్ కార్యదర్శి డాక్టర్ పి.సుమంత్‌రెడ్డి, సింగనబోయిన నర్సింహయాదవ్, గడ్డం జ్ఞాన ప్రకాశ్‌రెడ్డి, ఫక్కీర్ కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి



రానమ్మపేట: రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం

రామన్నపేట, జూలై 26: సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని, అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని శుక్రవారం రామన్నపేట మండల కేంద్రంలో మాతృదేవో భవ, పితృదేవోభవ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాతృదేవో భవ పితృదేవో భవ సంస్థ అధ్యక్షుడు కురుమేటి నవీన్, సామాజిక కార్యకర్త నోముల యాదగిరి, మాజీ జడ్పీటీసీ పున్న లక్ష్మీ, మాజీ సర్పంచ్ శిరిషా, సింగిల్ విండో చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, డాక్టర్ వీరన్న, వేముల సైదులు, మేడి రాజు, విష్ణు, ప్రవీన్ పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో అమరులైన భారత ఆర్మీ జవాన్లకు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు ఉష్కాగుల గిరిబాబు, కట్కూరు శ్రీకాంత్, గూడూరి మంజునాథ్, రాపర్తి నవనీత్, మరసాని సాయి, బద్దం లింగుస్వామి, గొల్లూరి యశ్వంత్, మొగుదాల విక్రమ్, బద్ధంరాజు,పెద్దగోని నరేష్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: బీజేపీ ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల గుండా కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రచ్చ శ్రీనివాస్, కర్రె ప్రవీణ్, బందారపు మల్లేశంగౌడ్, ప్రభాకర్, జానకిరాములు, బుచ్చిబాబు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు మచ్చ నర్సింహ్మాగౌడ్, రాజేందర్‌సింగ్, నాయకులు చిత్తర్ల శ్రీనివాస్‌గౌడ్, శేషగిరిరావు, వల్లాల నర్సింహ పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: ఆలేరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు డి.మంజుల, ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేష్, ఉపాధ్యాయులు యోగేశ్వర్‌రావు, డాక్టర్ పోరెడ్డి రంగయ్య, సైదులు, పరమేష్, నాగయ్య, హేమలత ఉన్నారు.

పేదల ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు



నిరాహార దీక్ష చేస్తున్న ఏశాల అశోక్‌కు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

భువనగిరి రూరల్, జూలై 26: పేదలకు ఇళ్ల స్థలాల పట్టా సర్టిఫికెట్లు ఇచ్చే వరకు పాలకులపై పోరాటాలు ఉధృతం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు గాను శుక్రవారం భువనగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా గోద శ్రీరాములు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన విధంగా నివాస స్థలాలు ఇచ్చి, ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తామన్న నిర్ణయాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. భువనగిరి శివారులోని సింగన్నగూడెంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు వెంటనే డబుల్‌బెడ్ ఇళ్లు కేటాయించాలన్నారు. హన్మాపురం, బొమ్మాయిపల్లి గ్రామాల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు స్థలాలు ఇవ్వాలన్నారు. అనంతరం తహసీల్దార్ అంజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వివిధ సంఘాల ప్రతినిధులు బండి జంగమ్మ, చెక్క వెంకటేశ్, సోమన సబిత, పుట్ట రమేశ్, వస్త్రావుల అభిలాష్, చింతల మల్లేశ్, రాఘవులు, పెంటయ్య, భిక్షపతి, దాసరి లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి, యాదగిరి, అనిల్, రాంబాబు, సత్తయ్య ఉన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



మునిపంపులలో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

చౌటుప్పల్ టౌన్, జూలై 26: ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండి.పాషా, పట్టణ కార్యదర్శి బండారు నర్సింహ, సీపీఎం మునిసిపల్ ఫ్లోర్ లీడర్ జి.లక్ష్మణ్ డిమాండ్‌చేశారు. స్థానిక రంగారెడ్డి భవన్‌లో శుక్రవారం సీపీఎం పట్టణ కమిటీ విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ మునిసిపాలిటీలోని 20వార్డుల్లో ఈ నెల ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన సీపీఎం పోరుబాట కార్యక్రమంలో ప్రజలు అనేక సమస్యలను తమ దృష్టికి తెచ్చారని వారు తెలిపారు. సమావేశంలో సీపీఎం నాయకులు వి. శ్రీనివాస్, ఆకుల ధర్మయ్య, బత్తుల దాసు, బొడ్డు అంజిరెడ్డి, చీకూరి ఈదయ్య, ఊషయ్య, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, కె.శివ, టి.మల్లేశ్, ప్రకాష్, బి.కృష్ణ, ఎన్.నర్సింహ పాల్గొన్నారు.

వలిగొండ: చిత్తాపురం నుండి వేములకొండకు వెళ్లే మెటల్ రోడ్డుకు వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాటలో భాగంగా చిత్తాపురం రోడ్డును పరిశీలించారు.

రామన్నపేట: మునిపంపులలో అపరిష్కృతంగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని సీపీఎం గ్రామ కార్యదర్శి తొలుపునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ పంచాయీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు తాళ్లపల్లి జితేందర్, జోగుల శ్రీనివాస్, యాదాసు నర్సింహ, భాషయ్య, యాదగిరి, నర్సింహ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

చౌటుప్పల్ టౌన్ : మొక్కలను విరివిగా నాటి, పచ్చదనాన్ని పెంపొందించాలని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు కోరారు. స్థానిక బస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం ట్రీనిటీ హైస్కూల్ విద్యార్థులు, ఆర్టీసీ, మునిసిపల్ ఉద్యోగులు మొక్కలను నాటారు. మునిసిపల్ కమిషనర్ ఎన్‌వీ నాయక్, డీఈ రాములు, ఆర్టీసీ నార్కట్‌పల్లి డిపో మేనేజర్ శ్రీపాథ్, కౌన్సిలర్‌లు కె.లింగస్వామి, దండ హిమబిందుఅరుణ్‌కుమార్, సీతారామచంద్రస్వామి దేవాలయం చైర్మన్ బి.మురళి, ట్రీనిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ మంజుల, చైర్మన్ కృష్ణారావు పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం చౌటుప్పల్ పట్టణంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్ కమ్ జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్ల కార్డులను పట్టుకొని నిరసన తెలిపారు. ప్రిన్సిపాల్ దీపాజోషి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

మోటకొండూరు : ఆగస్టు 9న ఢిల్లీలో జరిగే మాదిగల మహాధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొట్ల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి భైరపాక నాగరాజు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మహాసభకు సంబంధించిన కరపత్రాన్ని అవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వంగపల్లి చిరంజీవి, మండల ప్రధదాన కార్యదర్శి కొల్లూరి శ్రీకాంత్, బొట్ల పరమేష్, వంగపల్లి నర్సింహ్మా, బొట్ల అంజనేయులు, బిక్షపతి, జనగాం బాలరాజు, ఆడెపు బిక్షపతి, నాగులు పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్ : భవన నిర్మాణ కార్మికుల కోసం థంబ్ విధానాన్ని రద్దు చేసి, పాత విధానాన్నే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షకార్యదర్శులు గోరేటీ రాములు, ఎండీ.ఇమ్రాన్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో కార్మిక శాఖ అధికారి తాహేర్‌కు వినతి పత్రం అందజేసిన అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులకు రావాల్సిన పెండింగ్ క్లైయిమ్స్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి లక్ష్మయ్య, కార్యవర్గ సభ్యుడు సామల శోభన్‌బాబు, నాయకులు సీతారం, గౌస్, రాంచందర్, రవీందర్ ఉన్నారు.

భువనగిరి అర్బన్ : కాంగ్రెస్ ప్రభుత్వం చేవేళ్ల బహిరంగ సభలో గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు అజ్మీరకిషన్ అన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టరేట్ ఏవో సి.జగన్మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు భూక్య నరేష్‌నాయక్, రాజునాయక్, ధరావత్ వెంకటేశ్, శంకర్‌నాయక్, అశోక్‌నాయక్, తార్యనాయక్, బిచ్చనాయక్, బాలునాయక్, శ్రీనునాయక్ ఉన్నారు.

రాజాపేట: పరిసరాలు పరిశుభ్రతగా ఉంచుకునేందుకు ప్రజలను అధికారులు చైతన్యం చేయాలని, స్వచ్ఛతతో ఆరోగ్యంగా ఉంటారని జడ్పీ సీఈవో శోభారాణి, డీపీవో సునంద అన్నారు. శుక్రవారం రాజాపేట మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. దూదివెంకటపూర్ నర్సరీను పరిశీలించారు.

భువనగిరి రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్దిస్తుందని డాక్టర్ బి.తులసి అన్నారు. శుక్రవారం డ్రై డేలో భాగంగా మండలంలోని చందుపట్లలో పర్యటించి మురికి నీటి నిల్వలను పరిశీలించి ట్యాంకులు, సంపులు, గోళంలో ఉన్న పాకురు నీటిని పరబోసి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్ సునీత, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

భువనగిరి రూరల్: ప్రత్యేక అధికారుల పాలనలో ఆరు నెలల నుంచి ఎలాంటి అభివృద్ధి జరగక గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నాయకులు ఎదునూరి మల్లేశం, అన్నంపట్ల కృష్ణ, కొండమడుగు నాగమణి, మోటె ఎల్లయ్య, వెంకటేష్, మైనయ్య, చంద్రయ్య, కిషన్, మధు తదితరులున్నారు.

భువనగిరి రూరల్: బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భువనగిరి మాజీ ఎంపీ బీజేపీ జాతీయ నేత డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. భువనగిరి మండలం నందనం గ్రామానికి చెందిన నాగెల్లి సావిత్రమ్మ (75) మృతి చెందింది. బూర నర్సయ్య గౌడ్ శుక్రవారం సావిత్రమ్మ ఫ్లెక్సీ వద్ద నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నాగెల్లి సత్యనారాయణ గౌడ్, నల్లమాస వెంకటేశ్ ఉన్నారు.